భారత రాజ్యాంగంలోని 151వ అధికరణాన్ని అనుసరించి గవర్నర్‌కు సమర్పించడం కోసం ఈ నివేదికను రూపొందించడమైంది. ఆంధ్రప్రదేశ్‌లో 2004-05 నుండి 2011-12 మధ్యకాలంలో అమలు చేసిన 'జలయజ్ఞం' పై ఆడిట్ సమీక్షా ఫలితాలు ఈ నివేదికలో ఉన్నాయి. వెనుకబడిన, గిరిజన, కరవు పీడిత ప్రాంతాలలో రిజర్వాయర్ల నిర్మాణం, ఎత్తిపోతల పథకాలతో కూడిన సాగునీటి సదుపాయాలను అభివృద్ధి చేయడం ద్వారా 97.46 లక్షల ఎకరాల ఆయకట్టు కల్పించడం, 22.53 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించడం ఈ కార్యక్రమం ఉద్దేశం.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'జలయజ్ఞం' కింద చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల్లో కొన్నింటిని 2006-07, 2008-09, 2009-10 సంవత్సరాలకు సంబంధించిన భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ నివేదికల్లో చర్చించడమైంది. గత ఆడిట్‌లలో కొన్ని విడి ప్రాజెక్టుల అమలు తీరు, గోదావరీ జలాల వినియోగ ప్రాధికార సంస్థ పనితీరు, సత్వర సాగునీటి ప్రయోజన కార్యక్రమం, మూడోపక్ష నాణ్యతా నియంత్రణల అమలు తీరులను పరిశీలించడం జరిగింది. ప్రస్తుత ఆడిట్ సమీక్షలో, ఈ కార్యక్రమం కింద ప్రకటించిన లక్ష్యాలను సాధించడంలో కీలకమైన అంశాలను పరిశీలించడం ద్వారా మొత్తంగా 'జలయజ్ఞం' కార్యక్రమం అమలులోని విస్తృత, స్థూల అంశాలపై ఆడిట్ దృష్టి సారించడమే కాకుండా, మచ్చుకు తనిఖీ చేసిన 26 ప్రాజెక్టుల అమలుకు సంబంధించి, నిర్దిష్టమైన పరిశీలనలను కూడా వెల్లడి చేయడం జరిగింది.

భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ జారీ చేసిన ఆడిట్ ప్రమాణాలకు అనుగుణంగా ఈ ఆడిట్‌ను నిర్వహించడం జరిగింది. 2012 జూలైలో జరిగిన సమీక్షానంతర సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం/నీటిపారుదల శాఖ వెలిబుచ్చిన అభిప్రాయాలనూ, వారి రాతపూర్వక సమాధానాలనూ పరిగణనలోకి తీసుకొన్న తర్వాతే ఈ నివేదికను ఖరారు చేయడమైంది.

ఈ ఆడిట్ నిర్వహణలో నీటిపారుదల - ఆయకట్టు అభివృద్ధి శాఖ అందించిన సహకారానికి ఆడిట్ ధన్యవాదాలు తెలుపుతోంది.

ఈ తెలుగు నివేదికలో ఏమైనా సందేహాలుంటే అనువాదానికి మూలమైన ఆంగ్ల నివేదికను అధికారికంగా తీసుకోగలరు.